తమ్ముళ్లూ.. ఇదేం వ్యసనం!

- 'దుర్గం'లో గుట్టుగా గంజాయి వ్యాపారం
- చాప కింద నీరులా జోరుగా విక్రయాలు
- మత్తులో జోగుతున్న యువత



టీ వీరాపురంలో టీడీపీ నాయకుడు పెంచిన గంజాయి మొక్క

రాయదుర్గం: 'దుర్గం' ప్రాంతంలో గంజాయి వాసన గుప్పుమంటోంది. మార్కెట్‌లో కూరగాయలు దొరికినంత తేలిగ్గా మత్తు పదార్థాలు దొరుకుతున్నాయి.. కర్ణాటక సరిహద్దులో ఉండే యువత వ్యసనాన్ని 'క్యాష్' చేసుకొని లోగుట్టుగా 'గమ్మత్తు' అయిన వ్యాపారం చేస్తున్నారు. ఇంకేముందీ వయసుతో సంబంధం లేకుండా మత్తుకు బానిసవుతున్నారు. చివరకు మానసిక, శారీరక, ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో కన్నవారిని నరక కూపంలోకి నెట్టుతున్నారు. కొందరు తెలుగుదేశం నాయకులు సైతం ఈ వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని మారెమ్మగుడి, నేసేపేట, రైల్వేస్టేషన్, శాంతినగర్, హైస్కూల్ మైదానం తదితర ఏరియాల్లో మాదక ద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత బంగారు భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటోంది. పట్టణంలో ఈ వ్యాపారం గత కొద్ది రోజుల నుంచి విస్తరిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయితో నింపిన సిగరేట్ రూ.150 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నట్టు పుకార్లు కాస్త షికార్లు చేస్తున్నాయి. వీటికి యువత బానిసగా మారుతున్నారు. ఇటీవల టీ వీరాపురంలో టీడీపీ నాయకుడు గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు బయటపడిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమయ్యింది. ఈ గ్రామంలో మరింత మందికి ఈ వ్యాపార లావాదేవీలతో సంబంధాలు ఉన్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కర్ణాటక సరిహద్దులో ఉండే రాయదుర్గంలో కొందరు ఈ వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం పెదరాగుడ్డం, రాంపురం, మొలకాల్మూరు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి గంజాయి నింపిన సిగరెట్లను తెప్పించి రూ.150 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం పోలీసులకు తెలీకుండా గుట్టుగా సాగిస్తున్నారు.

బానిసవుతున్న యువత

మొదట్లో స్నేహితుల ప్రోద్బలంతో ధూమపానం, మద్యపానం అలవాటు చేసుకొని ఆ తర్వాత గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారు. చివరకు అవి లేకుంటే జీవనం సాగనంతగా తయారవుతున్నారు. ఇంట్లోంచి దొంగతనం చేయడం, ఇతరులను డబ్బులు అడగడం, చివరకు రూ.200ల కోసం ప్రాణాలు తీయడం, ప్రాణాలు తీసుకునే స్థాయికి దిగజారి పోతున్నారు. యువతలో మార్పు తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఎంత కౌన్సెలింగ్ చేసినా మార్పు కనిపించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీ వీరాపురంలో మరింత మంది..

రాయదుర్గం మండలం టీ వీరాపురంలో గంజాయి పెంచడం, వాటిని విక్రయించడం ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ఓ టీడీపీ నాయకుడు గంజాయి మొక్కలు పెంచుతూ పోలీసులకు పట్టుబడటం సంచలనమైంది. గ్రామంలో మరింత మంది ఈ వ్యాపార లావాదేవీలు గుట్టుగా సాగిస్తున్నారని చర్చ సాగుతోంది. కళాశాలలకు సెలవులు రాగానే ఈ గ్రామానికి ఎక్కువ మంది విద్యార్థులు వచ్చిపోతుంటారని స్థానికులు చెప్తున్నారు. పట్టుబడిన వ్యక్తితో పోలీసులు కూపీ లాగితే అసలు విషయం బయటపడుతుందని చెప్తున్నారు.

అవగాహన అవసరం



మత్తు పదార్థాల వాడకం శరీరానికి హాని కరం. వాటిని అరికట్టేలా వివిధ స్థాయిల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువత తెలుసుకోవాలి. వీటిని సరదా కోసం అలవాటు చేసుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు ఆది లోనే గుర్తించి వ్యసనాలకు అడ్డుకట్ట వేయాలి.

– మాధవి, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

కఠిన చర్యలు చేపట్టాం



మాదక ద్రవ్యాలు, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ వ్యవహారంలో ఎంతటివారినైనా సరే ఉపేక్షించేదిలేదు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గంజాయి విక్రయిస్తూ లేదా సేవిస్తూ పట్టుబడినా క్రిమినల్ చర్యలు చేపడతాం. ఈ చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి. ఈ విషయంపై ఏ చిన్న ఫిర్యాదు లేదా ఫోన్‌కాల్ వచ్చినా కట్టడికి చర్యలు చేపడతాం. మాదకద్రవ్యాలు, గంజాయి వాడకాన్ని అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలి.

– మరళీమోహన్, సెబ్ సీఐ, రాయదుర్గం

క్లుప్తంగా

17న ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు



రుక్మిణీ సమేత పాండురంగస్వామి మూలవిరాట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో ఈ నెల 17న ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు, 18న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. 17న ఉదయం ఆలయంలో స్వామికి విష్ణు సహస్ర నామావళి, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు, మంగళహారతి, రాత్రి 10 గంటల నుంచి ఉదయం వరకు అఖండ భజన ఉంటుందన్నారు. 18న ఉదయం 8 గంటల నుంచి వీధుల్లో రుక్మిణీ సమేత పాండురంగస్వామి రథోత్సవం జరుగుతుందని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేటీ మురళి, రాజశేఖర్ తెలిపారు.

ఘనంగా ఎస్కే ఆంజనేయుల వర్ధంతి



ఎస్కే ఆంజనేయుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్, ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్కే ఆంజనేయుల వర్ధంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఎస్కే చారిటబుల్ వ్యవస్థాపకులు లెనిన్‌బాబు రాధాస్వామి ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ టీ.రాజు తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా నాయకుడిగా, కుందుర్పి సర్పంచ్‌గా , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా, చివరగా ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బొమ్మలింగ, జగదీశ్ రఘువీరా, విలువల బడుల ఉపాధ్యాయులు శ్రీకాంత్, దిలీప్, అనిత, ఉమాదేవి, మీన, చంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయండి



కొలిమిపాళ్యం సమీపంలో చెట్లపై తీసుకువెళ్లిన విద్యుత్ వైర్లు

కుందుర్పి: వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని జంబుగుంపల, మలయనూరు, ఎనుములదొడ్డి తదితర పంచాయతీల రైతులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా 369 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మరో వైపు బోరుబావుల తవ్వకాలు ఎక్కువ కావడంతో రైతులు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కింద కెపాసిటీకి మించి కనెక్షన్లు వేసుకోవడంతో లోఓల్టేజీతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు. కాగా కొత్త విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులపై తహసీల్దార్ సంతకం అవసరం అయ్యింది. కాగా, ప్రస్తుత తహసీల్దార్ హనుమంతు సంతకం చేయడానికి అంగీకరించక పోడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ముద్ద చర్మవ్యాధి నుంచి కాపాడుకోవాలి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గుమ్మఘట్ట: ముద్దచర్మవ్యాధి సోకకుండా పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పూలకుంట,గౌనికుంట గ్రామాల్లో 196 పశువులకు ముద్దచర్మవ్యాధి టీకాలను ఉచితంగా వేసినట్లు ఆయన తెలిపారు. ముద్ద చర్మవ్యాధి ప్రబలకుండా ముందస్తుగా టీకాలను వేసి, నివారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. రైతులు, పెంపకందారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రమేష్, మాంతేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గంటౌన్: స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సమస్యలు పరిష్కరించాలని రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందించారు. హెరిటేజ్ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి హులికుంటిమూర్తి, సంయుక్త కార్యదర్శి శివకుమార్‌లు ఎమ్మెల్యే కాలవను కలిశారు. కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో కోటముఖ ద్వారం జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని, రైల్వే స్టేషన్ నూతన భవనం ప్రారంభించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రాయదుర్గంలో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని, కదిరిదేవరపల్లి – తిరుపతి రైలును పునరుద్ధరించాలని కోరారు.

శాకంబరి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



శాకంబరి అలంకరణలో వాసవిమాత

బొమ్మనహాళ్: ఆషాఢ మాసంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధానంగా గ్రామం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, గ్రామ ప్రశాంతతో వర్ధిల్లాలని పూజలు నిర్వహించారు.

21న గోదావరి కవితోత్సవం

అనంతపురం కల్చరల్: ఈనెల 21 పిఠాపురం వేదికగా సాగే గోదావరి కవితోత్సవం పోస్టర్లను ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరానికి విచ్చేసిన సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గుత్తాహరిసర్వోత్తమ నాయుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రమేష్ నారాయణ, శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వడ్డే సుధాకర్ మాట్లాడారు. పిఠాపురంలో జరుగనున్న కవితోత్సవంలో అనంత వాసులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. గుర్రం జాషువా అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ స్ఫూర్తిదాయక నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక కవులు, రచయితలను ప్రోత్సహిస్తుండటం అభినందనీయమన్నారు. శ్రీశ్రీ కళావేదిక 5 వేల మంది సభ్యులతో ఇప్పటి వరకు 40 పుస్తకాలను ముద్రించిందన్నారు. యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా మరోసారి పెద్ద ఎత్తున కవితోత్సవం నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

గౌని అనంతమ్మ మృతి తీరనిలోటు



గొల్లపల్లిలో గౌని లక్ష్మీకాంతారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: గొల్లపల్లి సర్పంచు గౌని అనంతమ్మ అకాల మరణం తీరనిలోటు అని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నార. మండలంలోని గొల్లపల్లి గ్రామ సర్పంచ్ గౌని అనంతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. ఆదివారం మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పరామర్శించారు. మెట్టు గోవిందరెడ్డి గొల్లపల్లి గ్రామానికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గౌని కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో రాఘవేంద్రరెడ్డి, చిత్ర తిప్పారెడ్డి, మాజీ సర్పంచ్ విజయేంద్ర, ఏకుల ప్రతాప్, ఏకుల నగేష్, గొబ్బె ప్రబన్న, జరుకుల గురుమూర్తి, అడ్వొకేట్ వెంకటరెడ్డి, అజ్జప్ప తదితరులు ఉన్నారు.

అక్రమాలు అరికట్టేందుకే సామాజిక తనిఖీలు

- సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్‌పర్సన్ లక్ష్మీనారాయణ



పి.నారాయణపురం గ్రామసభలో మాట్లాడుతున్న రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ

కూడేరు: అవినీతి, అక్రమాలు చోటు చేసుకోకుండా అరికట్టేందుకే ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో 2023–24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.7.56 కోట్లతో చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీపై ఈ నెల 11 నుంచి క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టారు. ఆదివారం జల్లిపల్లి, పి.నారాయణపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన క్షేత్ర స్థాయి తనిఖీల్లో వెలుగు చూసిన తప్పిదాలను, రికార్డుల్లో నమోదు చేయని పనులు తదితర వాటిని చదివి వినిపించారు. బిల్లులు పంపిణీలో, పనుల కల్పనలో, పింఛన్ల నగదు పంపిణీలో సిబ్బంది అక్రమాలకు పాల్పడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఆయన ఉపాధి కూలీలను, లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచ్ హనుమంత రెడ్డి, ఏపీఓ తులసీ ప్రసాద్, జిల్లా రీసోర్స్ పర్సన్లు, ఉపాధి, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు



కూడేరు: పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం



కలుగోడులో కొలువుదీరిన పీర్ల స్వాములు



భైరసముద్రంలో కొలువుదీరిన పీర్లు

కూడేరు: మండల కేంద్రంలో మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం చిన్న సరిగెత్తు నిర్వహించారు. చావిడిలో పెద్ద వన్నూరుస్వామి, కుళ్లాయిస్వామి, చిన్న వన్నూరు స్వామి, బొడ్డు స్వామి, కబడీ పీర్, బుర్రా బాబయ్య పీర్లతో పాటు ఇతర పీర్ల దేవుళ్లకు ముజువార్ మైనుద్దీన్ చక్కెర చదివింపులు చేశారు. అనంతరం చావిడి నుంచి అంజనేయ స్వామి ఆలయం వరకు పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళవారం పెద్ద సరిగెత్తు (పానకాలు) పీర్ల దేవుళ్ల అగ్ని గుండ ప్రవేశం, బుధవారం దేవుళ్ల జలధికి వెళ్లే కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయని ముజవార్ మైనుద్దీన్ తెలిపారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, భూపసముద్రం, బేలోడు, నేత్రపల్లి, గోనబావి, గొల్లపల్లి, గుమ్మఘట్ట, పూలకుంట గ్రామాల్లో పీర్లను కొలువుదీర్చారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో ఆదివారం లాలుస్వామి పీర్ల చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నపీర్ల (ఖాసీం సవారీ)ను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు పీర్లచావిడిలో చక్కెరతో ఫాతేహాలు చేయించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు లాలుస్వామి పీర్లను దర్శించుకొని, ప్రత్యేక ఫాతేహాలు చేయించారు. చక్కెర తులాభారం చేయించి ఆయన తన మొక్కును తీర్చుకున్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని బ్రహ్మసముద్రం, భైరసముద్రం పిల్లలపల్లి, కోనాపురం తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఆదివారం చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్ల స్వాములను కొలువుదీర్చారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పీర్ల చావిడిలో పీర్ల స్వాములకు చక్కెర, బెల్లం చదివింపులు చదివించారు. అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. 16న పెద్ద సరిగెత్తు (పానకాలు), 17న పీర్లు అగ్ని గుండ ప్రవేశం, జలధికి పోయే కార్యక్రమాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



పిల్లలపల్లిలో పీర్ల చావిడిలో కొలువు దీరిన పీర్లు





లాలుస్వామి పీర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రత్యామ్నాయం వైపు..రైతుల చూపు





కూడేరు సమీపంలో నర్సరీలో పెంచుతున్న టమాట, మిరప నారు, టమాట పంట

కూడేరు: ఏటా వేరుశనగ సాగు చేసి, నష్టాలు చవిచూస్తున్న రైతన్నలు.. ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. తద్వారా మండలంలోని రైతులు అధిక దిగుబడితోపాటు ఆదాయం కూడా గడిస్తున్నారు. దీంతో మార్కెట్లో టమాట, పచ్చి మిరప ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాయ నాణ్యత బట్టి కేజీ టమాట రూ.40 నుంచి 50లు , పచ్చి మిర్చి రూ.50 నుంచి 60 వరకు పలుకుతోంది. 20 రోజులు క్రితం పచ్చి మిర్చి, టమాట కేజీ రూ.100 లు వరకు పలికాయి. కూడేరు మండలంలో టమాట, మిరప పంటలు సాగు చేసేందుకు మరింత ఆసక్తి చూపుతున్నారు. రైతుల అవసరానికి తగ్గట్టు నర్సరీల్లో కూడా టమాట, మిరప నారు పెంచుతున్నారు. టమాట ఒక మొక్క 30 నుంచి 50 పైసలు, మిరప ఒక మొక్క 60 నుంచి 90 పైసల వరకు అమ్ముతున్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో టమాట పంటను సాగు చేయగా కాయలు కోతకు వస్తున్నాయి. కాయలు అమ్ముకొని రైతులు ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రస్తుతం సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో టమాట, 100 ఎకరాల్లో మిరప పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న టమాట, మిరప ధరలు పంట కోత దశకు వచ్చినపుడు ఉంటే కాసుల పంట పండుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా జయకృష్ణ



లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు జయకృష్ణ, నగేష్‌బాబు, జాబీర్

ఉరవకొండ: ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎంసీ జయకృష్ణ వరుసగా రెండో సారి అధ్యక్షుడిగా నియమితుల య్యారు. ఆదివారం లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా ఎంసీ జయకృష్ణతో పాటు కార్యదర్శిగా బి.నగేష్‌బాబు, కోశాధికారిగా హెచ్.జాబీర్ ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా లయన్స్ క్లబ్ గవర్నర్ రమేష్‌నాథ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉరవకొండ లయన్స్ క్లబ్ సేవలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఉచిత వైద్యశిబిరాలతో పాటు పేద విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడంతో క్లబ్ ఎంతో ముందుందని తెలిపారు.లయన్స్ సభ్యులు మఠం సోము, ఎంసీ నాగభూషణం, పీజీఎస్ నూర్‌మహ్మద్, నాగేశ్వరావు, లక్ష్మీనారాయణ, నజీర్ పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు



కుక్కలు, పిల్లులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

రాయదుర్గం/రాయదుర్గంటౌన్: పట్టణంలోని మున్సిపల్, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. ఆదివారం ఈ కార్యక్రమాన్ని పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. సుమారు 48 కుక్కలు, 8 పిల్లులకు రేబీస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడారు.. వ్యాక్సిన్ ప్రాముఖ్యత పై వివరించారు. రేబీస్‌కు ఎలాంటి చికిత్స లేదని, నివారణే మార్గమని తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణంతాక వ్యాధులైన రేబీస్, అంత్రాక్స్, బ్రూసెలోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేబీస్ వ్యాధి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పెంపుడు జంతువులు పెంచుకుంటున్న యజమానులంతా తప్పక రేబిస్ టీకా వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంబదూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ నిత్యానందబాబు తెలియజేశారు. ప్రజలు కూడా వారి సమస్యలను ఆర్జీల రూపంలో అధికారులకు విన్నవించుకోవచ్చన్నారు.

మేఘమా ఊరించకే..చినుకా నేలరాలవే



కూడేరు వద్ద కమ్ముకున్న మేఘాలు



కూడేరు సమీపంలో పంటలు సాగు చేసేందుకు నేలను సిద్ధం చేసిన రైతులు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేసేందుకు అదును జూన్ 15న ప్రారంభమై, ఈ నెల 15 (సోమవారం)తో ముగుస్తుంది. కానీ విత్తనం విత్తుకోవడానికి వర్షమే కురవలేదు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తారు. మే నెల చివరలో, జూన్ నెల మొదట్లో వర్షాలు బాగా కురిశాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తాయని, రైతులు పంటల సాగుకు నేలను సిద్ధం చేసుకున్నారు. మండల వ్యాప్తంగా 3,502 మంది రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో 3,240 క్వింటాళ్లు విత్తనకాయలు విక్రయించింది. మరికొందరు రబీలో పండించిన వేరుశనగ విత్తనకాయలను రైతుల నుంచి కొనుగోలు చేశారు. నేలను బాగా దుక్కి చేసుకొని, విత్తనానికి సిద్ధం చేసుకున్నారు. అదును దాటుతున్నా వర్షం కురవలేదు. మేఘాలు ఊరించి, ఉసూరుమనిపిస్తున్నాయి. చినుకు మాత్రం నేల రాలలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - కూడేరు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9912220732, 9010470185, 9010223701